


### ❖ రూ.2500 ఎప్పుడిస్తరు?



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తమన్నరు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నది. ఇప్పటివరకు ఆ ఊసే లేదు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి నయా పైసా కేటాయించలేదు. అంతేకాకుండా ఇప్పటికీ కేసీఆర్ ఇచ్చిన పింఛన్లే వస్తున్నాయి. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు చేయూత ద్వారా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పిన్రు. దీనిపై కూడా బడ్జెట్‌లో మాట్లాడలేదు. అంటే ఈ ప్రభుత్వానికి మహిళలపై ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నది. ఆరు గ్యారెంటీల పేరిట మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే అన్ని ఎన్నికల్లో మహిళలు తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

**- శిరీష, మహాలక్ష్మి పథకానికి అర్హురాలు, నిర్మల్.మండలం**




బడ్జెట్ **2025-26**

# గ్యారెంటీలు గోవిందా! 6







## అసెంబ్లీలో భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనిపించని ప్రస్తావన

- హామీల అమలుపై చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు
- మోసం చేసిన సర్కారుపై మండిపడుతున్న సబ్బండ వర్గాలు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్/నిర్మల్, మార్చి 20 (నమస్తే తెలంగాణ ) : ఆరు గ్యారెంటీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. నిన్న( బుధవారం) ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రస్తావనే కనిపించకపోవడంపై రైతులు, వృద్ధులు, మహిళలు, సబ్బండ వర్గాలు మండిపడుతున్నాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500పై ప్రభుత్వ పద్దులో కనీస ప్రస్తావన లేదు. ఆడవాళ్లకు అందుతున్న ఏకైక ఉచిత బస్సు రవాణాకు నిధులు తగ్గించింది. గృహజ్యోతి పథకం కింద ఇస్తున్న ఉచిత కరెంట్‌కు దాదాపు రూ.350 కోట్లకు కోత పెట్టింది. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ చాలా మందికి రావడం లేదు. ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి ఎక్కువ నిధులు ఇస్తారనుకుంటే గతంలో ఎంతైతే ఇచ్చారో ఇప్పుడూ అంతే ఇచ్చారు. దీంతో అన్ని రకాలుగా అర్హులై ఉండి రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం ఎదురు చూస్తున్న కొత్తవారికి ఇక సబ్సిడీ సిలిండర్ ఇవ్వమని చెప్పకనే సర్కారు చెప్పింది. ఇక కాంగ్రెస్ గెలిస్తే రూ.2వేల వస్తున్న పింఛన్ రూ.4వేలకు వస్తుందని ఆశపడిన వృద్ధులు, ఒంటరి మహిళలు, ఇతర పింఛన్‌దారులను మరోసారి సర్కార్ మోసం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పింఛన్‌దారులకు రూ.4 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలంటే రూ.27 వేల కోట్లు అవసరం అవుతాయి. కానీ.. రూ.13.50 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే గతంలో కేసీఆర్ సర్కారు ఇచ్చిన రూ.2 వేల పింఛన్ తప్ప పెంచిందిఏం లేదని తేలిపోయింది. ఒక రైతు భరోసా విషయంలో కూడా మరోసారి సర్కారు మోసం చేసింది. ఇప్పటికే రెండు సీజన్లుగా పెట్టుబడి సాయం లేదు. ఈసారైనా బడ్జెట్‌లో రైతు భరోసాకు ప్రత్యేక నిధులు ఉంటాయనుకుంటే అసలు ఆ ప్రస్తావనే బడ్జెట్‌లో రాలేదు. దీంతో పైలెట్ గ్రామాల్లో తప్ప మిగిలిన గ్రామాల్లోని రైతులకు రైతుభరోసా రూ.12 వేలు రావడంపైన నీలినీడలు కమ్ముకున్నాయి. ఇక రైతు రుణమాఫీ సగం మందికే ఇచ్చిన సర్కా మిగిలిన వారికి ఎగవేసినట్లేనని తేలిపోయింది. ఏ ఊరికి వెళ్లిన వంద శాతం రుణమాఫీ కాలేదు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తేనైనా రుణమాఫీ అవుతుందనుకుంటే అసలు విషయాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ముందేమో రుణమాఫీకి రూ.46 వేల కోట్లు అవుతుందన్నారు. క్యాబినెట్ మీటింగ్‌లో రూ.30 వేల కోట్లు చాలు అన్నారు. గత బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు పెడుతున్నట్లు చెప్పారు. తీరా రూ.20 వేల కోట్లతో రుణమాఫీ చేసినట్లు నిన్న బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అంటే సగానికి కంటే ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ ఇక కాదనే విషయం తేలిపోయిందని నిపుణులు అంటున్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఇస్తామన్న ఆరు గ్యారెంటీలను ఎగవేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై సబ్బండ వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

### ❖ మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిర్పూర్(యూ), మార్చి 20: కాంగ్రెసోల్లు పేద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామంటే ఎంతో సంబుర పడ్డాం. నెలకు రెండున్నర వేలు వస్తే పిల్లలను పోషించుకోవడానికి, ఇంట్ల అవసరాలకు ఉపయోగపడుతాయని మురిసిపోయిన. కానీ ఈ మాట మహిళలను ఆదుకోవడానికి కాదు.. ఆ మాటలన్నీ మా ఓట్లు లాక్కోవడానికి అని అర్థమవుతున్నది. గవర్నమెంట్‌లకు వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇచ్చిన మాట గుర్తుకు రావడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

**- గేడం లక్ష్మి, గృహిణి, సిర్పూర్(యూ)**

### కేసీఆర్ ఇచ్చిన రూ.2016 వస్తున్నాయి..

సిర్పూర్(యూ), మార్చి 20: మా అమ్మకు వయస్సు అయిపోయింది. ఇంట్లోనే ఉంటుంది. ప్రతి నెల ఆమెకు దవాఖాన ఖర్చులు, మందుల ఖర్చుల వుత్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నిలప్పుడు ముసలోళ్లకు రూ.4000 పింఛన్ ఇస్తానం అని అంటే అందరం నమ్మినం. పింఛన్ పెంచితే మా అమ్మ ఖర్చులకు ఎంతో ఉపయోగపడతాయి అనుకున్న. గవర్నమెంట్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర అవుతున్నది. ఇప్పటికీ పింఛన్ పెంచలేదు. కేసీఆర్ ఇచ్చిన రూ.2016 మాత్రమే ఇస్తున్నరు. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పింఛన్ పెంచదు.. వాళ్లు మాకు ఇవ్వరని అర్థమైంది.

**-పుర్క సురేశ్, సిర్పూర్(యూ)**



### ❖ రుణమాఫీ ఉత్తమాటేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులందరికీ రుణమాఫీ చేశామని చెప్పారు. అది పూర్తిగా అబద్ధం. మా ఆలూర్ గ్రామంలోనే నాతోపాటు వంద మందికి పైగా రైతులకు మాఫీ కాలేదు. ఈ బడ్జెట్‌లో కాని వారి కోసం కొత్తగా నిధులు కూడా కేటాయించలేదని తెలిసింది. అంటే ఈ ప్రభుత్వం మాకు మాఫీ చేయదని తేలిపోయింది. ఇది పూర్తిగా అబద్ధాల ప్రభుత్వం. మేం రైతులం కాదా? మేమేం పాపం చేసినం. మాకెందుకు మాఫీ చేయరు? నేను పీఏసీఎస్ ద్వారా రూ.1.70 లక్షల రుణం తీసుకున్న. మాఫీ లిస్టులో చివరి జాబితా వరకు చూసినం. ఏడు నెలల కింద గతేడాది ఆగస్టులో రుణమాఫీ చేయాలంటూ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన. అన్ని అర్హతలు ఉన్నా నాకెందుకు మాఫీ కాలేదని అప్పట్లో అధికారులను నిలదీస్తే పొంతన లేకుండా మాట్లాడిన్రు. రుణమాఫీ డబ్బులు విడుదల అయ్యాయి. కానీ.. ట్రెజరీలో పెండింగ్ ఉందని అప్పట్లో అధికారులు చెప్పారు. దీంతో త్వరలోనే మాఫీ అయితుందేమోనని ఎదురుచూసిన. ఇప్పటి వరకు కాలేదు. ఈ బడ్జెట్‌తో ఆశలు ఆవిరైనయ్. నాకు గ్రామంలో తొమ్మిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటి వరకు యాసంగికి సంబంధించి రైతు భరోసా డబ్బులు కూడా రూపాయి రాలేదు. గత వానకాలంలో సన్నరకం ధాన్యం 220 బస్తాల వరకు ప్రభుత్వానికి అమ్మిన. ఇందుకు సంబంధించి రూ.40 వేల వరకు బోనస్ డబ్బులు రావాలి. ఎప్పుడు వస్తాయో కనీసం చెప్పేవారు లేరు. రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.

**- దేశెట్టి ప్రవీణ్, రైతు, ఆలూర్, సారంగాపూర్ మండలం**



### ❖ రూ.2 లక్షల రుణమాఫీ కాలే..

నాకు రూ.2 లక్షల చిల్లర పంట రుణం ఉంది. గతంలో అందరికీ మాఫీ చేసినోళ్లు నాకు చేయలేదు. ఈసారి బడ్జెట్‌లో నిధులు ఇచ్చి నా మాదిరిగా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తారు అనుకున్నా. కానీ.. అసలు డబ్బులే ఇవ్వలేదని అంటున్నారు. ఇక నాకు రుణమాఫీ కాదని తేలిపోయింది. కాంగ్రెసొస్తే రూ.2 లక్షలు మాఫీ అవుతుంది అనుకున్నా. దానికి సవాలక్ష కొర్రీలు పెట్టి అసలు మాఫీ చేయకుండా వదిలేస్తారనుకో లేదు.

**- అన్నమనేని సుధాకర్‌రావు, తాండూర్**



### ❖ రూ.4 వేల పింఛన్ వచ్చేట్టు లేదు..

ప్రస్తుతం నాకు రూ.2వేల పింఛన్ వస్తుంది. కాంగ్రెస్ గెలిస్తే రూ.4వేలు ఇస్తామన్నరు. మళ్ల నిన్న, ఇవాళ అసలు మాకు నిధులేవో ఇయ్యలేదని బయట చెప్తున్నరు. ఇక రూ.2వేల పింఛనే ఇస్తరా? ముందు చెప్పినట్లు రూ.4వేల పింఛన్ రాదా? అనేది అర్థం కావడం లేదు. రూ.4 వేల పింఛన్ వస్తే ఖర్చులకు కొన్ని ఉంచుకుని, మిగిలిన పైసలతో ఆసుపత్రికి పోదామని ఆశగా చూస్తున్నా. ఇస్తరో ఇయ్యరో తెలుస్తలేదు. ఎన్నికల ముందు చెప్పినట్లు పింఛన్ రూ.4వేలు ఇస్తే బాగుంటది.

**- ఇందారపు భీమయ్య, తాండూర్**



### ❖ ప్రయోజనం లేదు..

బడ్జెట్‌తో ప్రజలకు ప్రయోజనం లేదు. పథకాలకు సరిపడా నిధులు కేటాయించకపోగా అభివృద్ధిని విస్మరించారు. ఆరు గ్యారెంటీలతోపాటు మిగతా పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉండగా పక్కన పెట్టారు. ఇందిరమ్మ ఇండ్ల నిధుల కేటాయింపు సరిగా లేదు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ప్రతినెల రూ.2500 ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా ఊసే లేదు. చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామన్నారు. కల్యాణలక్ష్మీ పథకంలో భాగంగా తులం బంగారం ఇస్తామని చెప్పినా నిధులు లేవు.

**- విజ్జిగిరి నారాయణ, ఆదిలాబాద్**

# హ్యాట్రిక్కే టార్గెట్

- నిర్మల్ జిల్లాను మూడో సారి ప్రథమ స్థానంలో నిలుపడమే లక్ష్యం
- పది పరీక్షలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశాం..
- నిర్మల్ జిల్లాలో నేటి నుంచి ప్రారంభం.. 47 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 9,126 మంది విద్యార్థులు
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో డీఈవో రామారావు



నిర్మల్ డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, మార్చి 20 : 'నిర్మల్ జిల్లాను పదో తరగతి పరీక్షల్లో మూడోసారి ప్రథమ స్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. నేటి(శుక్రవారం) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న పరీక్షలకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లావ్యాప్తంగా 47 కేంద్రాల్లో 9,129 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 4,444.. బాలికలు 4,685 మంది ఉన్నారు. 34 ప్రభుత్వ కేంద్రాలు, జూనియర్ కళాశాల సెంటర్లు 3 ఉన్నాయి. 47 మంది చీఫ్ ఎగ్జామినేషన్ అధికారులు, 47 డిపార్ట్‌మెంటల్ అధికారులు, 47 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, 523 మంది ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలను నియమించాం.' అని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావుతో 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూ.

**నమస్తే తెలంగాణ :** మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**డీఈవో :** మాస్ కాపీయింగ్‌ను పూర్తిగా అరికట్టాలని ఆదేశాలు జారీ చేశాం. విధులు నిర్వహించే ఉపాధ్యాయులు నిబంధనలు ఉల్లంఘిస్తే కలిగే చర్యలపై వివరించాం. ప్రతి పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించాం. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో తహసీల్దార్, ఎస్సై స్థాయి అధికారి, విద్యాశాఖ అధికారి ఉంటారు.

**నమస్తే :** వేసవి దృష్ట్యా తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

**డీఈవో :** 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తాగునీరు, తరగతి గదుల్లో ఫ్యాన్‌లు, ప్రతి కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు అందుబాటులో ఉంటారు. విద్యార్థులందరికీ సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

**నమస్తే :** కేంద్రాల విభజన ఎలా?

**డీఈవో :** 47 కేంద్రాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించాం. ఏ కేటగిరీలో 23, బీ కేటగిరీలో 17, సీ కేటగిరీలో ఏడు సెంటర్లుగా విభజించాం. ఇందులో సీ కేటగిరీపై దృష్టి సారించాం. ఈ కేంద్రా పరిధిలో తపాలా కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లు అందుబాటులో లేనందున సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్‌ను నియమించి పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం.

**నమస్తే :** వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకున్న చర్యలు?

**డీఈవో :** విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు మూడు గ్రాండ్ టెస్టులు నిర్వహించాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశాం. విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించాం. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారు ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దారు.

**నమస్తే :** నిమిషం నిబంధన అమలులో ఉందా?

**డీఈవో :** పది పరీక్షలు రాసే విద్యార్థులకు నిమిషం నిబంధన అమలులో లేదు. విద్యార్థులు ఆలస్యం కాకుండా గంట ముందుగానే కేంద్రాలకు చేరుకుంటే ఒత్తిడి లేకుండా పరీక్ష రాయవచ్చు. హాస్టల్ విద్యార్థులు సకాలంలోనే కేంద్రాలకు చేరుకుంటారు. ఇంటి నుంచి వచ్చే విద్యార్థులు ముందుగానే రావాలి.

**నమస్తే :** హాల్‌టికెట్‌ల విషయం ఏమిటీ?

**డీఈవో :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో హాల్ టికెట్‌ల పంపిణీ కొనసాగుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్‌లు ఇస్తామనే ఒత్తిడి తేవద్దని హెచ్చరించాం. నేరుగా నెట్ నుంచి కూడా హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాయవచ్చు.

**నమస్తే :** ఈసారి పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు ఉన్నాయి?

**డీఈవో :** ఈసారి బుక్‌లెట్ విధానం ద్వారా పరీక్ష రాయనున్నారు. పేపర్ల లీకేజీని అరికట్టేందుకు ప్రశ్నాపత్రాలపై మొదటిసారిగా క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించనున్నారు.

**నమస్తే :** విద్యార్థులకు ఏం చెప్పదలచుకున్నారు?

**డీఈవో :** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశాం. వీటిని ఉపయోగించుకోవాలి. విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండాలి.

# బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కు నిధులేవీ?


- ప్రభుత్వాన్ని ప్రశ్నించని నాయకులు వ్యవహారశైలి మార్చుకోవాలి
- జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మార్చి 20(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు మొండిచేయి చూపిందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడీ తప్పా పేదలకు, రైతులు, మహిళలకు ప్రయోజనం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు జరుగుతున్న నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. జిల్లా అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి ఈ బడ్జెట్ నిదర్శనం అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చనాక-కొరట ప్రాజెక్టుకు నిధులు కేటాయించపోవడాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై పట్టింపులేదని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జిగిరి నారాయణ, సాజిదుద్దీన్, గంద్రత్ రమేశ్, అజయ్, పవన్ నాయక్, మార్సెట్టి గోవర్ధన్, గంగయ్య, అశోక్ స్వామి, దమ్మపాల్, దాసరి రమేశ్, శివకుమార్, దయానంద్, సురేందర్, మహేశ్, ఫెరోస్, మహేశ్ పాల్గొన్నారు.

# ప్రతి పంటను కొనుగోలు చేయాలి



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, మార్చి 20 : రైతు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బోథ్‌లోని మార్కెట్ కమిటీ యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పంటకు మద్దతధర చెల్లిస్తూ కొనుగోలు చేయాలని సూచించారు. శనగ కొనుగోలులో ఎకరాకు 6.29 క్వింటాళ్ల నిబంధనను సడలిస్తూ.. 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రశాంత్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రుక్మాన్ సింగ్, సురేందర్ యాదవ్, బొడ్డు శ్రీనివాస్, తాహెర్ బిన్ సలాం, రాథోడ్ సజాన్, మందుల రమేశ్, నానక్ సింగ్ పాల్గొన్నారు.

**అడెల్లి రోడ్డును పూర్తి చేయిస్తాం..**

బోథ్-నిర్మల్ ప్రాంతాల మధ్య దూరభారాన్ని తగ్గించేందుకు నిర్మిస్తున్న అడెల్లి రోడ్డును పూర్తి చేయిస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలోని ఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిగిలిన రోడ్డు పనుల విషయమై అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్స్‌లో ప్రస్తావిస్తానన్నారు. అంతకుముందు బోథ్‌లో నిర్మిస్తున్న సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.



ఆదిలాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

# నేటి నుంచి పది పరీక్షలు

**విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన ఆదిలాబాద్ డీఈవో ప్రణీత**

ఎదులాపురం, మార్చి 20 : పది పరీక్షలు నేడు(శుక్రవారం) ప్రారంభం కానుండగా.. ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉండనున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10,051 మంది పరీక్షలు రాయనుండగా.. వారి కోసం 52 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో నిమిషం నిబంధన అమలులో ఉండేదని, ఇప్పుడు ఐదు నిమిషాల వరకు కూడా కేంద్రంలోకి అనుమతిస్తారు. బోర్డు నుంచి రెండు సెట్లు వచ్చాయని, పేపర్ లీక్ అయితే రెండో సెట్‌తో ఇబ్బందులు లేకుండా పరీక్ష కొనసాగిస్తామని డీఈఓ ప్రణిత తెలిపారు.